ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి

- విద్యార్థులకు స్పెల్‌విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు
- గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంస పత్రాల అందజేత


బయ్యారం: విద్యార్థినికి ప్రశంసపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు


కురవి: విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేస్తున్న ఉపాధ్యాయులు


గంగారం: ప్రశంసపత్రాలను అందజేస్తున్న డీడీ ఎర్రయ్య


మరిపెడ: బహుమతులు అందజేస్తున్న సీఐ సాగర్


కేసముద్రంలో..


గూడూరులో..


గార్ల హైస్కూల్లో..


దోర్నకల్‌లో..

బయ్యారం: ఆంగ్లభాషపై నైపుణ్యాలను పెంపొందించుకోవాలని బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం.లింగరాజు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అసోసియేషన్ మండల కన్వీనర్ ధనుంజయ అన్నారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లిష్ ప్రతిభా పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసపత్రాలతోపాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోకన్వీనర్ దస్తగిరి, ఉపాధ్యాయులు వీరన్న, సాధ్వీమణి, వెంకన్న, జయరాజు, కవిత పాల్గొన్నారు.
దోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో శనివారం మండల స్థాయి ఆంగ్ల భాషా స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎల్టా ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో హెచ్‌ఎం మాణిక్యం, ఎల్టా ప్రతినిధులు సంగయ్య, సోమన బోయిన శ్రీనివాస్, సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు.
గూడూరు: ప్రాథమిక స్థాయి నుంచి ఇంగ్లిషులో ప్రావీణ్యత పొందిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో రానిస్తారని హెచ్‌ఎం కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని బాలుర హైస్కూల్‌లో శనివారం ఇంగ్లిషు లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి ఇంగ్లిష్ స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు అసోసియేషన్ మండల కన్వీనర్ డాక్టర్ పులుసం సాంబయ్య, కోకన్వీనర్ పంతని సాంబయ్య, హెచ్‌ఎం చేతుల మీదుగా విజేతలకు ప్రశంసపత్రాలు అందించారు. ఈఎల్‌టీఏ ప్రతినిధులు పాల్గొన్నారు.
కురవి: మండల స్థాయి స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో విజయవంతంగా నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు వలబోజు సుధాకర్ సేవా ఫౌండేషన్ జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్టా మండల కన్వీనర్ గాడిపల్లి శ్రీను, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గిరిజ, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్.అనిత, ఉపాధ్యాయులు వెంకన్న, శ్రీనివాస్, నరేందర్, చైతన్య, రవికుమార్ పాల్గొన్నారు.
గంగారం: విద్యార్థులు ఆంగ్ల భాషపై నైపుణ్యాన్ని పెంపొందించుకొని మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని డీడీ మంకిడి ఎర్రయ్య అన్నారు. మండలంలోని ఆశ్రమోన్నత పాఠశాలలో ఎంఈఓ, ఎల్టా సహకారంతో నిర్వహించిన స్పెల్ విజార్డ్ ఆంగ్ల పోటీల్లో సాయి చంద్, చరణ్య, అంజలి, అర్చనలు ప్రతిభ కనబర్చారు. వారికి ప్రశంసపత్రాలను ఆయన అందించారు.
కొత్తగూడ: ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని ఎంఈఓ శ్రీదేవి సూచించారు. మండలకేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షల కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.
కేసముద్రం: కేసముద్రం, ఇనుగుర్తి మండల కేంద్రాల్లో గల జెడ్పీఎస్‌ఎస్‌లలో ఈఎల్‌టీఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి స్పెల్లింగ్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలను నిర్వహించారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మెమోంటోలు, సర్టిఫికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం బండారు నరేందర్, కేసముద్రంస్టేషన్ హెచ్‌ఎం శాంత కుమారి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.
మరిపెడ: మండల స్థాయి ఆంగ్లభాష పోటీలలో మరిపెడ మోడల్ స్కూల్ విద్యార్థులు నందిగామ స్వరూప, గండి సాయి, పావులూరి సాయివెంకట్ ప్రతిభ కనబరిచారు. ప్రిన్సిపాల్ ప్రేమ్‌సాగర్ హర్షం వ్యక్తం చేశారు. బహుమతి ప్రాధానోత్సవం కార్యక్రమంలో సీఐ సాగర్, శ్రీమతి, దీప్తి తదితరులు పాల్గొన్నారు.
దంతాలపల్లి: మండలంలోని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆంగ్లభాషపై పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన ఎ.తేజశ్రీ, బి.దీపిక, నిహారికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
గార్ల: స్పెల్ విజార్డ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేసినట్లు పాఠశాల హెచ్‌ఎం శీలంశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన సీహెచ్ చందన, కె.దినేశ్వర్, హారిక, బి.చిన్నారిలకు సర్టిఫికెట్లతోపాటు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎల్టా కన్వీనర్ భాస్కరరావు, కోకన్వీనర్ లోకేష్, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని దళిత బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ పోలేపాక వెంకన్న, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు చక్రవర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం డీఈఓ రామారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలన్నారు. కొందరు ఉపాధ్యాయులు ఉదయం 11గంటలకు వచ్చి బయోమెట్రిక్ వేసి మధ్యాహ్నం సొంత పనులు చూసుకుంటున్నారని, వారిపై చర్య తీసుకోవాలన్నారు.

పాఠశాలల పరిశీలన

దోర్నకల్: పీఎంశ్రీ కార్యక్రమం కింద ఎంపికైన పలు పాఠశాలలను శనివారం నోడల్ అధికారుల బృందం పర్యటించింది. పీఎం శ్రీ కార్యక్రమం ద్వారా పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి నిధులు కేటాయించి అభివృద్ధి చేయనున్నారు. డోర్నకల్‌లోని బాలుర ఎంపీపీఎస్, జెడ్పీహెచ్‌ఎస్, చిలుకోడు ఎంపీపీఎస్, ముల్కలపల్లి ఎంపీపీఎస్, చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌ను ఎంపిక చేశారు. పాఠశాల హెచ్‌ఎం వెంకట్రావ్, ప్రభుదాస్, గౌసియా పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ ప్రాంతం సందర్శన

గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై నిర్మించే బ్రిడ్జి ప్రాంతాన్ని శనివారం ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బ్రిడ్జి నిర్మాణం ఎలా చేపడితే వ్యయం తగ్గే అవకాశం తదితర అంశాలను ఈ ప్రాంత ప్రజలతో చర్చించామని వెల్లడించారు. ఈఈ వెంట డీఈ రాజేందర్, ఏఈ అనిల్, తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

చిన్నగూడూరు: ఈనెల 18నుంచి కొనసాగనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ మూల సునీత అన్నారు. శనివారం మండలంలోని గుండంరాజుపల్లిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ సలీమా, ఎంపీడీఓ శ్యాంసుందర్, స్పెషల్ ఆఫీసర్ నర్సింహ స్వామి, బీఆర్‌ఎస్ నాయకులు మురళీధర్ రెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

విద్యార్థుల మాక్ పోలింగ్



మరిపెడ రూరల్: మరిపెడ మండలం వీరారం జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులు మాక్ పోలింగ్ వ్యవహరించిన తీరు పలువురిని ఎంతగానో ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు పోలింగ్ ఆఫీసర్స్‌గా వ్యవహరించి బ్యాలెట్ పత్రాలు, పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటింగ్ నిర్వహించారు. హెచ్‌ఎం ఆర్.వెంకన్న, ఉపాధ్యాయులు మధు, శ్రీనివాస్, గోపికృష్ణ, సుకన్య, జానకి, వెంకన్న పాల్గొన్నారు.

అధికారులపై ఫిర్యాదు



గూడూరు: సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులను జమ చేసే అకౌంట్ల డిజిటల్ కీలను అక్రమంగా తమ వద్ద పెట్టుకున్న ఎంపీడీఓ, ఎంపీఓలపై చర్య తీసుకొని, తమకు న్యాయం చేయాలని మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు బాలూనాయక్, పూనెం యాకయ్య, రాజులతోపాటు పలువురు సర్పంచ్‌ల భర్తలు శనివారం ఎస్సై దిలీప్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన విషయంపై ఎంపీఓ చందూను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు డిజిటల్ కీలను తమ వద్దే పెట్టుకున్నామని తెలిపారు.

పరామర్శ..



చిన్నగూడూరు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మంగోరిగూడెం బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మంగోరిగూడెం గ్రామంలో పార్టీ బృందం మృతుల కుటుంబాలను కలిసి పరామర్శించారు. మృతి చెందిన కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున గ్రానైట్ క్వారీ ఓనర్, లారీ ఓనర్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు రమేష్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

'భగీరథ'పనులు త్వరగా పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

మహబూబాబాద్: మిషన్ భగీరథ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం మిషన్ భగీరథపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మిషన్‌భగీరథ పథకం ప్రవేశ పెట్టిందని, దానిని విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ ఫరీద్, కమిషనర్ ప్రసన్నరాణి, భగీరథ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రం శివారు నిజాం చెరువు మినీ ట్యాంక్ పనులను ఎమ్మెల్యే పరిశీలించి అధికారులతో సమీక్షించారు.

మతిస్థిమితం లేని వృద్ధురాలికి చేయూత


వృద్ధురాలికి భోజనం పెడుతున్న తహసీల్దార్

గూడూరు: మండలంలోని జగన్నాయకులగూడెం బస్‌స్టాప్ వద్ద కొన్ని రోజులుగా మతిస్థిమితం కోల్పోయిన ఓ వృద్ధురాలికి తహసీల్దార్ అశోక్‌కుమార్, సహచర ఉద్యోగులతో చేయూతనందించారు. శనివారం గ్రామ సందర్శనకు వెళ్తున్న తహసీల్దార్‌కు జగన్నాయకుల గూడెం జీపీ పరిధిలోని జాతీయ రహదారి పక్కన గల బస్టాప్ వద్ద మతిస్థిమితం కోల్పోయిన వృద్ధురాలు కనిపించింది. వెంటనే వృద్ధురాలి వద్దకు వెళ్లి భోజనం అందజేశారు. సహచర ఉద్యోగులతో గూడూరు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ఆస్పత్రి సిబ్బంది సాంబయ్య ఏ ఊరు అమ్మా మీది అని అడగ్గా.. నెక్కొండ మండలం తోపనపల్లి గ్రామం అని తడబడుతూ చెప్పింది. వెంటనే ఆమె తరపు బంధువులకు సమాచారం అందించి వారి గృహానికి తరలించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, సాంబయ్యకు వృద్ధురాలు కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

25 క్వింటాళ్ల నల్లబెల్లం స్వాధీనం


నిందితులను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

తొర్రూరు: నిషేధిత నల్లబెల్లం, ఇతర తయారీ పదార్థాలను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఘటన శనివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎక్సైజ్ సీఐ వరద శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొమ్మనపల్లి తండాకు చెందిన గుగులోతు అనిల్ గుడుంబా తయారీ పదార్థాలు రవాణా చేస్తూ వచ్చిన ఆదాయంతో జీవనం సాగిస్తున్నాడు. ముందస్తు సమాచారం మేరకు ఎక్సైజ్ పోలీసులు కొమ్మనపల్లిలో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో 25 క్వింటాళ్ల నల్లబెల్లం, 2.10 క్వింటాళ్ల పటిక, 50లీటర్ల నాటుసారా లభ్యమైంది. అక్రమ రవాణాకు బాధ్యుడైన అనిల్‌తోపాటు వాహన డ్రైవర్ పాడ్య వెంకన్నను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో ఎస్సైలు శ్రీనివాసులు, రవళి, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

'బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'


మాట్లాడుతున్న రమేష్ రాథోడ్

నర్సింహులపేట: బీజేపీ అభివృద్ధి కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని బీజేపీ నియోజకవర్గ పాలక్, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం బీజేపీ ఆధ్వర్యంలో నియోజక వర్గ పోలింగ్ బూత్ స్థాయి అధ్యక్షులు, సభ్యులకు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ పూర్ణచందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు రమేష్, మహేష్, లక్ష్మణ్, వెంకట్‌రెడ్డి, సందీప్ పాల్గొన్నారు.

వేయింగ్ మిషన్ అందజేత


పెద్దవంగర: వేయింగ్ మిషన్ అందజేస్తున్న ఎంపీపీ రాజేశ్వరి

పెద్దవంగర: గర్భిణులు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఈదురు రాజేశ్వరి, వడ్డెకొత్తపల్లి సర్పంచ్ నెమరుగొమ్ముల ప్రవీణ్‌రావు అన్నారు. శనివారం మండలంలోని చిట్యాల, వడ్డెకొత్తపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలకు డిజిటల్ వేయింగ్ మిషన్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సర్పంచ్ లచ్చమ్మ, శ్రీనివాస్, జీపీ కార్యదర్శులు శివరాత్రి మురళి, రాజు, నాయకులు రమేష్, అశోక్, యాదమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.
దోర్నకల్: మండలంలోని మన్నెగూడెం గ్రామంలో శనివారం అంగన్‌వాడీ కార్యకర్తలకు సర్పంచ్ కొండపల్లి రాధిక వేయింగ్ మిషన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు విజయపాల్ రెడ్డి, కార్యదర్శి గురుస్వామి పాల్గొన్నారు.

సహకరించండి

గూడూరు: గ్రానైట్ క్వారీలో పనిచేస్తున్న కిందిస్థాయి కార్మికుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని మండలంలోని తీగలవేణి జీపీ పరిధిలోని మిడ్‌వెస్ట్ గ్రానైట్ కార్మికులు ఎంపీటీసీ వాసుదేవరెడ్డిని కోరారు. శనివారం కార్మికులు ఉప్పలయ్య, చక్క, మల్లేష్, వెంకన్న మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా క్వారీలో పనిచేస్తున్న తమ సమస్యలను పైస్థాయి అధికారులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు.

ఇన్‌చార్జ్‌గా నరేష్

నెహ్రూసెంటర్: తెలంగాణ యాదవ మహాసభ సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా చిత్తారి నరేష్‌ను ఎన్నుకున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షులు సూత్రపు రాజుయాదవ్ శనివారం తెలిపారు.

ధనుర్మాస వ్రత మహోత్సవ పూజలు



మహబూబాబాద్ రూరల్: ధనుర్మాస వ్రత మహోత్సవ పూజా వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రలలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయం, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో గోదాదేవి అమ్మవారిని పెళ్లి కుమార్తెను చేసే వేడుకలు కనుల పండుగగా జరుగుతున్నాయి. శనివారం భక్తి శ్రద్ధలతో మహిళలు మంగళహారతులు, పూజాసామగ్రి తీసుకువచ్చారు.

ఎస్సారెస్పీ కాల్వ పరిశీలన

నెల్లికుదురు: మండలంలోని మునిగిలవీడు గ్రామంలో గల డీబీఎం-48 ఎస్సారెస్పీ ఉపకాల్వను శనివారం ఇరిగేషన్ శాఖ సీఈ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. చెత్తాచెదారం పేరుకుని, కాల్వ ప్రారంభంలోని షటర్ ధ్వంసమైందని సర్పంచ్ నల్లాని నవీన్‌రావుతోపాటు, పలువురు రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సందర్శించారు. సమస్యను పరిష్కరించేలా చూస్తామని సీఈ హామీ ఇచ్చారు.

విద్యార్థుల అదృశ్యంపై విచారణ

తొర్రూరు: మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర కిశోర్, కిన్నెర కార్తీక్‌ల అదృశ్యంపై అధికారులు విచారణ చేపట్టారు. విద్యార్థులు చదివే మండలంలోని గుర్తూరు ఆదర్శ పాఠశాలలో శనివారం తహసీల్దారు రాఘవరెడ్డి అదృశ్య ఘటనపై ఆరా తీశారు. ప్రిన్సిపాల్ సునీతను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈవిచారణలో ఈనెల 4వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇరువురు విద్యార్థులు వరంగల్ రైల్వే స్టేషన్‌లో కనిపించినట్లు సీసీ కెమెరాల ఆధారంగా తెలిసిందని ప్రిన్సిపాల్ తహసీల్దారుకు తెలిపారు. తల్లిదండ్రుల మందలింపుతోనే ఇల్లు విడిచి వెళ్లారని, ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సతీష్ తెలిపారు. విచారణలో గుర్తూరు సర్పంచ్ మోత్కూరి రవీంద్రచారి, స్థానికులు ఉన్నారు.

8నుంచి క్రికెట్ టోర్నమెంట్

మహబూబాబాద్ అర్బన్: జిల్లా లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 8వ తేదీ నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ టీ-టెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ కన్వీనర్ సయ్యద్ జాకీర్ హుస్సేన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంను కన్వీనర్, ఆర్గనైజ్ సభ్యులు శనివారం పరిశీలించారు. గెలుపొందిన జట్టుకు రూ.30వేల నగదు, ద్వితీయ జట్టుకు రూ.20వేలు, తృతీయ రూ.10వేల నగదు బహుమతులు అందజేస్తామన్నారు. టోర్నమెంట్ నిర్వాహకులు శ్రీపాల్, మహేష్ గౌస్, సాయి, భరత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సంత ప్రారంభం



గార్ల: మండలం మర్రిగూడెం వేంకటేశ్వరస్వామి ఆలయ భూమిలో నూతన సంతను సర్పంచ్ భూక్యా బుజ్జి, ఆలయ కమిటీ చైర్మన్ బి.అమర్‌చంద్ శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ వైస్ చైర్మన్ బూడిద రాణి, నరేందర్, సంత నిర్వహకులు విజయ్‌కుమార్, పక్తియా, జాంబ, శంకర్ పాల్గొన్నారు.

మిర్చితోటల పరిశీలన

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి, నర్సింహులపేట, అక్కిరాల గ్రామాల్లో మిర్చి తోటలను శనివారం వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించారు. మిర్చిలో తెల్ల దోమ, పచ్చ దోమ, తామర పురుగులు, నల్లి, రసం పీల్చే పురుగుల నివారణకు రైతులకు ఏఈఓ రామకృష్ణ అవగాహన కల్పించారు.

యాకమ్మకు పురస్కారం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ రవీంద్ర భారతి కళామందిర్‌లో జరిగిన కవి సమ్మేళనంలో జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ తాళ్లపల్లి యాకమ్మకు నందివాడ రత్నశ్రీ స్మారక పురస్కారం తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు జూలూరి గౌరీ శంకర్, మాజీ ఐఏఎస్, అవార్డు ప్రదాత శ్రీనంది వాడ భీమారావు అందజేశారు.

వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపిక

కురవి: రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు సీరోలు మండలంలోని కాంపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎ.మధు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె.లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఎంపికైన విద్యార్థిని, గైడ్ టీచర్ కె.సోమేశ్వర్, సైన్స్ టీచర్స్‌ను ఉపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్, సర్పంచ్‌లు అభినందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కేసముద్రం: మండల కేంద్రంలోని గాంధీసెంటర్‌లో టీఎస్ పీఆర్‌టీయూ క్యాలెండర్‌ను శనివారం సంఘం మండల ప్రధాన కార్యదర్శి గోపాల శ్రీధర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శాంతకుమారి, సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు నరేందర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు హరినాథ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై కళాజాతా

నర్సింహులపేట: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, పచ్చదనం, పరిశుభ్రతపై మండల కేంద్రంలోని సంతలో శనివారం కళాజాతా నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి సాత్విక్, వెంకన్న, బండ వెంకన్న, రాజమౌళి, రామనర్సయ్య, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

317 జీఓను రద్దు చేయండి

గార్ల: ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా మారిన 317 జీఓను రద్దు చేయాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం గార్ల నెహ్రూసెంటర్‌లో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కరరావు, రాజేశ్వరి, మంజుల, స్వర్ణలత, సురేందర్‌రెడ్డి, వెంకటరమణ, సుబ్బారావు, మురళి పాల్గొన్నారు.

స్థల పరిశీలన

దంతాలపల్లి: మండలం రేపోని, వేములపల్లి గ్రామాలలో బృహత్ పల్లెప్రకృతి వనం కోసం స్థలాన్ని శనివారం పరిశీలించినట్లు తహసీల్దార్ శివాని తెలిపారు. ఎంపీడీఓ గోవిందరావు, అప్సర్ పాషా, సర్పంచులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లల గుర్తింపు సర్వే

తొర్రూరు: బడి బయట పిల్లలను పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ గుగులోతు రాము అన్నారు. శనివారం మండలంలోని కపూర్యా తండా, ఈదులకుంట తండా, మడిపల్లి, వెంకటాపురం, పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కాలనీలో బడిబయట పిల్లల గుర్తింపు సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సీఆర్పీలు వీణ, రమేష్, భాస్కర్, కల్పనలు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలి

కొత్తగూడ: చిన్న వయస్సులోనే వ్యక్తిగత పరిశుభ్రతను అలవాటు చేయాలని గంగారం పీహెచ్‌సీ డాక్టర్ ప్రత్యూష అన్నారు. మండలంలోని కార్లాయి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గంగాధరి సందీప్ కిడ్నీలు దెబ్బతినడంతో వైద్య ఖర్చుల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న పదో తరగతి(2010-11) బ్యాచ్ విద్యార్థులు సందీప్‌ను పరామర్శించి, రూ.21వేలు అందజేశారు. కార్యక్రమంలో సందీప్, సురేష్, సంపత్, ఉమేష్, ఇస్మాయిల్, అంజద్, అజయ్ తదితరులు ఉన్నారు.

సన్మానం

దోర్నకల్: డోర్నకల్‌లో గ్లోబల్ పూర్ పీపుల్ అసోసియేషన్ పేరుతో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జమీల్‌ను హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసరావు గుప్తా, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారి, మేడ్చెల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి సన్మానించారు.

జీఓను రద్దు చేయాలి

మహబూబాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెచ్చిన జీఓ 1ని రద్దు చేయాలని టీడీపీ పార్లమెంట్ నియోజవర్గ అధ్యక్షుడు కె.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. టీడీపీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సునీత, వెంకటేశ్వర్లు, వెంకటనారాయణ, ప్రేమ్‌చంద్‌వ్యాస్ పాల్గొన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ



గార్ల: ఇండో టిబెన్ బార్డర్ పోలీస్‌గా పనిచేస్తూ విధి నిర్వహణలో మృతిచెందిన భూక్యా రమేష్ ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శనివారం గార్లలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎస్సై బానోత్ వెంకన్న, పీఏసీఎస్ వైస్ చైర్మన్ గంగావత్ లక్ష్మణ్‌నాయక్, సర్పంచ్ ధరావత్ సక్రు పాల్గొన్నారు. భూక్యా రమేష్ స్వగ్రామమైన పీక్లీతండాలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



నెహ్రూసెంటర్: హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో సంఘం పట్టణ కన్వీనర్ కుమ్మరికుంట్ల నాగన్న ఆధ్వర్యంలో పట్టణంలోని కూరగాయల హమాలీ కార్మికులు సీఐటీయూలో శనివారం చేరారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూలో చేరిన వారిలో సముద్రాల వెంకన్న, మధు, శ్రీను, సతీష్, నిరంజన్, ఉపేందర్, కృష్ణ తదితరులు చేరారు.

పట్టపగలు ఇంట్లో దొంగతనం

- రూ.80వేల నగదు, 20తులాల వెండి అపహరణ



నెల్లికుదురు: ఓ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలే తాళం పగులగొట్టి ఇంట్లో దొంగతనం చేసిన సంఘటన మండలంలోని తారాసింగ్ బావి తండాలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. ఎస్సై పత్తిపాక జితేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తారాసింగ్ బావి తండాకు చెందిన గుగులోతు రవి తన ఇంటికి తాళం వేసి ఉదయం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనుక తలుపులు పగులగొట్టి, ఇంట్లో బీరువాను ధ్వంసం చేసి, అందులోని రూ.80వేల నగదు, 20తులాల వెంటి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జితేందర్ తెలిపారు.